క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకరికల్లు: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బి.నాగసురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. శనివారం తెల్లవారుఝామున (శుక్రవారం అర్ధరాత్రి) 12గంటల నుంచి శనివారం ఉదయం 9గంటల వరకు వ్యవసాయం కోసం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఇస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో మార్పులను వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

రైతు భరోసా కేంద్రాల్లో ఈ-పంట జాబితా

పెదకూరపాడు: మండలంలోని ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటలకు ఈ-పంట నమోదు కార్యక్రమం పూర్తి చేసినట్లు వ్యవసాయశాఖాధికారి ఇంజం శాంతి శుక్రవారం తెలిపారు. ఈ-పంట నమోదు చేసుకున్న రైతు జాబితాను ఆయా గ్రామ సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో ఈ నెల 26 నుంచి 29 వరకు ప్రదర్శించబడతాయన్నారు. అభ్యంతరాలు ఉన్న రైతులు ఈ నెల 29న రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు తెలియజేయాలన్నారు.

29 వరకు ముసాయిదా జాబితాల ప్రదర్శన

అచ్చంపేట: 2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట నమోదు చేసుకున్న వారి వివరాలతో కూడిన ముసాయిదా జాబితాలను మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించడం జరుగుతుందని ఏవో వెంకటేశ్వర్లు శుక్రవారం విలేకరులకు తెలిపారు. రైతులంతా తమ సమీప రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పంట నమోదుకు సంబంధించిన వివరాలు పరిశీలించుకోవాలని చెప్పారు. ఏమైనా తప్పులు ఉన్నట్లయితే రైతు భరోసా కేంద్రంలోని అగ్రికల్చర్ అసిస్టెంట్ దృష్టికి తీసుకెళ్లి సవరించుకోవాలని సూచించారు. 30వ తేదీన తుది జాబితా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఆ జాబితా ఆధారంగానే రైతులకు సబ్సిడీలు, రాయితీలు, పంట కొనుగోళ్లు వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముగిసిన శివరామబ్రహ్మం అంత్యక్రియలు



సత్తెనపల్లి: భార్యకు ప్రకృతి వైద్యం నిమిత్తం కేరళలోని చోటానిక్కర్ గ్రామానికి వెళ్లిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఏలూరి శివరామబ్రహ్మం గుండెపోటుతో మరణించిన విషయం విదితమే. శుక్రవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లోని వారి గృహంలో అంత్యక్రియలు నిర్వహించారు. ముందుగా మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, తదితరులు హాజరై మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదంశెట్టి వేదాద్రి, నాయకులు దేవరశెట్టి రవికుమార్, అన్నం మురళి, త్రిపుర మల్లు మల్లేశ్వరరావు, షేక్ జలీల్, ఈపూరి బ్రహ్మారెడ్డి, వెంగళరెడ్డి, చెంచిరెడ్డి తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ అదుపుతప్పి ఒకరు మృతి

ఈపూరు: ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని ముప్పాళ్ల అద్దంకి బ్రాంచి కెనాల్ వద్ద శుక్రవారం జరిగింది. సేకరించిన వివరాల మేరకు పానుగోటివారిపాలెం గ్రామానికి చెందిన గుంటుపల్లి రామాంజనేయులు (46) తన ట్రాక్టర్‌తో పొగాకు నారు తెచ్చేందుకు వెళ్తుండగా అద్దంకి బ్రాంచి కెనాల్‌పై అదుపు తప్పి కాలువలో పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బంధువులు, స్థానికులు మృతదేహాన్ని ఒడ్డుకు వెలికితీశారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. సంఘటనా ప్రాంతానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలస్తీనా ప్రజలకు అండగా ఉండాలి

నరసరావుపేట: భారతదేశం పాలస్తీనా ప్రజలకు అండగా ఉండాలని, ఇజ్రాయెల్ దాడులు నిలిపివేయాలని, పాలస్తీనా న్యాయమైన పోరాటానికి మద్దతు ఇవ్వాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. శుక్రవారం ఎన్జీవో హోంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ అధ్యక్షతన ప్రజాసంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు అత్యంత పాశవికంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్లపాటి రామారావు, పీడీయం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, ఎంసీపీయు జిల్లా కార్యదర్శి రెడ్ బాష, సీఐటీయూ నాయకులు షేక్ సిలార్, ఎంఐఎం పార్టీ పట్టణ కార్యదర్శి ధరియావలి, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటానాయక్, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చిన్న, బీసీ నాయకులు బాగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



మందుల కిట్ పంపిణీ చేస్తున్న చల్లంచర్ల సాంబశివరావు



చెవి పరీక్షలు నిర్వహిస్తున్న ఈఎన్‌టీ వైద్యుడు రామ్మోహన్‌రెడ్డి



దొడ్లేరులో జరిగిన వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, వైద్యసిబ్బంది

5,726 మందికి వైద్య పరీక్షలు

అచ్చంపేట: ఈనెల 2వ తేదీ నుంచి మండలంలో 17 సచివాలయాల పరిధిలోని 23 గ్రామాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలలో 5,726 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 3,000 మందికిపైగా కంటి పరీక్షలు నిర్వహించి 2,500 మందికిపైగా కళ్లజోళ్లకు ఎంపిక చేశామన్నారు. వీరందరికి కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. 157 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలోని వైద్యశాలలకు రిఫర్ చేయడం జరిగిందన్నారు. బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు మందులు పంపిణీ చేశామని, జ్వరపీడితులకు ప్రత్యేక చికిత్సలు నిర్వహించి వారికి కావలసిన మందులు ఇవ్వడం జరిగిందన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి అచ్చంపేట పీహెచ్‌సీ, సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలకు పంపడం జరిగిందన్నారు. అన్ని గ్రామాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని, గ్రామస్తులంతా ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో 932 మందికి వైద్యపరీక్షలు

ముగిసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు-1 సచివాలయం వద్ద శుక్రవారం ముగింపు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 932 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేసారు. శిబిరానికి ఈఎన్‌టీ వైద్యనిపుణులు డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ విశ్వనాథ్, పీహెచ్‌సీ డీడీపీ రమాదేవీ, డాక్టర్ సిరిచందన, డాక్టర్ మహమ్మద్ సాద్ పాల్గొని వైద్య పరీక్షలు చేసి మందులు అందచేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా పాల్గొని మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఇంటికి వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన శిబిరాలన్నింటిలో వైద్యులు అత్యంత సేవా దృక్పథంతో సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.మహేష్, గ్రామ సర్పంచ్ ముక్కు అంజలి, వైఎస్సార్‌సీపీ నాయకులు సయ్యద్ రహీం, కష్టారెడ్డి, మస్తాన్‌రెడ్డి, వలపు వెంకటేశ్ రెడ్డి, ఆరోగ్యవిస్తరణాధికారి శిఖాశ్యాంసన్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ భరోసా

సత్తెనపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 4, 28 వార్డుల ప్రజలకు సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చల్లంచర్ల మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు. ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు వైద్య సేవలు అందించడం వల్ల ఆర్థికంగా వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో వైద్యులు డాక్టర్ షేక్ మహబూబ్ అలీ, డాక్టర్ జి.ధర్మసింగ్ శాస్త్రి, డాక్టర్ సుష్మ, డాక్టర్ శంకరి ప్రభ లు 597 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రక్త శాతం, రాండమ్ బ్లడ్ షుగర్ పరీక్షలు 198 మందికి నిర్వహించారు. మలేరియా, ఈసీజీ పరీక్షలను ముగ్గురికి నిర్వహించారు. అదనపు వైద్య పరీక్షల నిమిత్తం 12 మందిని ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, 28వ వార్డు కౌన్సిలర్ షేక్ తాహేరున్నీసా, నాయకులు షేక్ మహ్మద్ గని, తుమ్మల వెంకటేశ్వరరావు, వల్లెం నరసింహారావు, ఉల్లంఘుల ప్రసాద్ బాబు, ఘన్‌సైదా, బుడే, మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు, మున్సిపల్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన నూర్‌బాషా కుటుంబాలు

అచ్చంపేట: అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పట్ల ఆకర్షితులవుతున్న అనేక మంది టీడీపీని వదిలి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. అచ్చంపేటకు చెందిన 15 నూర్‌బాషా కుటుంబ సభ్యులంతా టీడీపీకి బైబై చెప్పి గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయానికి శుక్రవారం స్వచ్ఛందంగా వెళ్లి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలామంది పార్టీలకు అతీతంగా అందుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులవుతున్నారన్నారు. వారంతటవారే స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరతామని, వచ్చే ఎన్నికలలో పార్టీ గెలుపుకు కృషిచేస్తామని చెబుతున్నారన్నారు. గత నాలుగున్నరేళ్లగా కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడంవల్లనే వైఎస్సార్ సీపీకి ఆదరణ లభిస్తోందన్నారు. పార్టీలో చేరినవారిలో షేక్ మస్తాన్‌వలి, షేక్ సులేమాన్, షేక్ శ్రీను, షేక్ మీరాబి, షేక్ ఖాశింబి, షేక్ సౌజన్య, షేక్ ఇమాంబి, షేక్ ఖాదింబి, షేక్ మస్తాన్‌బి, షేకి సానియాబేగం తదితరులు కుటుంబ సభ్యులతో సహా ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, కోఆప్షన్ సభ్యులు షేక్ సుభాని, ఉప సర్పంచ్ షేక్ జానీ, మైనారిటీ నాయకులు షేక్ కమల్‌సైదా, బీరువాల జాని తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

తృటిలో తప్పిన ముప్పు

- పత్తి లోడుతో వస్తున్న ఆటో బోల్తా
- క్షేమంగా బయటపడిన డ్రైవర్

నకరికల్లు: పత్తిలోడుతో వస్తున్న ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు. రద్దీగా ఉండే రహదారిలో అదృష్టవశాత్తు ఎలాంటి ముప్పు వాటిల్లలేదు. వివరాల్లోకి వెళితే ఫిరంగిపురం నుంచి పత్తిలోడుతో మినీ ఆటో గురజాల వైపుకు బయలుదేరింది. మార్గంమధ్యలో నకరికల్లు మండలం అడ్డరోడ్డు వద్దకు చేరుకునేసరికి ఆటోటైరు పేలిపోయింది. దీంతో ఆటో అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. ఆటోలోని పత్తి బోరియాలన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. ఆటోలో డ్రైవర్ మాత్రమే ఉన్నాడు. అతనికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదంతో రోడ్డుకిరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఘటనాస్థలానికి చేరుకున్న పెట్రోలింగ్ పోలీస్ సిబ్బంది పత్తిబోరియాలను మరొక వాహనంలోకి మార్పించి ఆటోను పక్కకు తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.



అడ్డరోడ్డు సమీపంలో నరసరావుపేట రోడ్డులో బోల్తాపడిన పత్తిలోడు ఆటో

ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపు పాటించాలి

- డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏడుకొండలు
- గృహవాసులకు లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్‌పై అవగాహన

నరసరావుపేట: బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ కలిగిన స్టార్ రేటింగ్ విద్యుత్ గృహోపకరణాలు వాడుతూ విద్యుత్ అవసరంలేని చోట లైట్లు ఆపు చేస్తే బిల్లు తగ్గి డబ్బు ఆదా అవుతుందని విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు పేర్కొన్నారు. శుక్రవారం సత్తెనపల్లి రోడ్డు లోని ఆదిత్య గృహ సముదాయంలో లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్‌పై గృహవాసులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. విద్యుత్ పొదుపుపై అనేక సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ టోల్ ఫ్రీ నెంబర్ 1912 గురించి తెలుసుకోవాలన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ రఫీ మాట్లాడుతూ విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించటం అలవాటు చేసుకోవాలని, డిజిటల్ ద్వారానే ఆన్‌లైన్ పేమెంట్ చేయవచ్చన్నారు. గృహ సముదాయం ప్రెసిడెంట్ సుబ్రమణ్యం మాట్లాడుతూ సదస్సు ద్వారా విద్యుత్ పొదుపు కార్యక్రమం ఈ రోజు నుంచే పాటిస్తామని పేర్కొన్నారు. గృహ వినియోగదారుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్టార్ రేటింగ్ కలిగిన ఫ్యాన్లు, ట్యూబ్ లైట్స్ ఇవ్వాలని కోరారు. తొలుత ప్రోగ్రాం కన్వీనర్ ఆర్.బంగారయ్య కరపత్రాలు పంపిణీ చేశారు, పాల్గొన్న వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌చార్జ్ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎన్విరాన్‌మెంట్‌పై పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు, గృహవాసులు

చిత్రకళా పోటీలో నరసరావుపేట వాసికి బహుమతి



గర్నెపూడి కల్యాణ్‌కుమార్

నరసరావుపేట ఈస్ట్: తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రం, కళాక్షేత్ర సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేమన పద్య భావన చిత్రకళా పోటీలలో పట్టణానికి చెందిన గర్నెపూడి కల్యాణ్ కుమార్‌కు తృతీయ బహుమతి లభించింది. వేమన పద్యానికి అనుగుణంగా చిత్రాన్ని రూపొందించటంతో బహుమతి లభించినట్టు కల్యాణ్ కుమార్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫైన్ ఆర్ట్స్ చదువుతున్న కల్యాణ్ వేమన పద్యం స్థాన బలిమిని తెలియచేసేలా చిత్రాన్ని తయారుచేశాడు. ఆయన తండ్రి దేవదానం చిత్ర కళాకారుడు. పట్టణానికి చెందిన చిత్రకళాకారులు కల్యాణ్‌ను అభినందించారు. ఈనెల 29న తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరగనున్న కార్యక్రమంలో కల్యాణ్ బహుమతి అందుకోనున్నాడు.



తృతీయ బహుమతి పొందిన చిత్రం

సాగునీటి విడుదలపై అసత్య ప్రచారం తగదు

మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య

బెల్లంకొండ: సాగు నీటి విడుదలపై ప్రభుత్వం మీద విమర్శలు చేస్తూ సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేయడం తగదని మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య తెలిపారు. మండలంలోని బెల్లంకొండ రెవెన్యూ పరిధిలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన రైతు తాళ్లూరి ముత్యాలరావు సాగు చేస్తున్న వరి పొలానికి వెళ్లి పంట ఎండుతుందని, ప్రభుత్వం నీటి విడుదల చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని వ్యవసాయ అధికారులపై, ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ శుక్రవారం పోస్టులు పెట్టారు. దీంతో మండల వ్యవసాయాధికారులు వెంటనే పొలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో కృష్ణయ్య మాట్లాడుతూ నాగార్జున సాగర్ కుడి కాలువ నుంచి ఖరీఫ్ 2023 గానూ సాగునీరు ఇవ్వడం లేదని, కావున ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని ముందుగానే తెలియజేశామన్నారు.

డిప్యుటేషన్ ఉద్యోగులను తిరిగి పంపండి

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాల్లో పనిచేస్తూ డిప్యుటేషన్‌పై వెళ్లిన ఫార్మసిస్ట్ టి.శ్రీనివాసులు, కార్యాలయ సూపరింటెండెంట్ షేక్ మెహరున్నీసా, సీనియర్ అసిస్టెంట్ ఎం.రాజ్‌కుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఎస్.శ్రావణిలను తిరిగి వైద్యశాలకు పంపేలా చర్యలు తీసుకోవాలని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ కోరారు. శుక్రవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు వినతిపత్రం పంపారు. ఏరియా వైద్యశాలలో రోగులకు, గర్భిణులకు ఇబ్బందిగా ఉందని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్టెమ్మి కార్యక్రమం కుంటుపడుతుందన్నారు. కనుక ఉద్యోగులను తిరిగి పంపే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వినతి పత్రాలను ఏపీ వీవీపీ కమిషనర్‌కు, ఏపీ వీవీపీ డీసీహెచ్ఎస్‌కు పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

నేడు ప్రసన్నాంజనేయుని ఆలయం మూసివేత

బెల్లంకొండ: చంద్ర గ్రహణం కారణంగా శ్రీ కోళ్లూరు ప్రసన్నాంజనేయుని ఆలయాన్ని శనివారం సాయంత్రం మూసివేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా వేంకట అనంతాచార్యులు తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు మూసివేయనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల తరువాత స్వామి వారికి గ్రహణ అభిషేక పూజల అనంతరం తిరిగి ఆలయాన్ని తెరవడం జరుగుతుందన్నారు. కావున భక్తులు శనివారం సాయంత్రం ఆలయంలో పూజా, భజనలు నిలిపివేయడంతో పాటు, నిద్రలు చేయడానికి వచ్చే భక్తులను అనుమతించడం లేదన్నారు.

రూ.6 కోట్లతో అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయాన్ని రూ.6 కోట్లతో పునర్నిస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా అమ్మ వారి బాలాలయంలో శుక్రవారం పూజాధికాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పాల్గొని పూజలు జరి పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణాన్ని పూర్తి రాతికట్టడంతో చేపడుతున్నట్టు తెలిపారు. సుమారు రూ.6 కోట్ల అంచనాలతో ముఖ్య ఆలయం, బహుమండపం నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. మొదటి విడత నిర్మాణాన్ని రూ.3.5 కోట్లతో త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇప్పటికే రూ.కోటి మంజూరు చేసినట్టు వివరించారు. విరాళాలు రూపంలో రూ.60 లక్షలు దాతలు ఇచ్చారని తెలిపారు. కామన్ గుడ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి, మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ జల్లి శ్రీనివాసరావు, రాధారపు శ్రీనివాసరావు, కొండపల్లి చినకోటయ్య, గుండాల శ్రీనివాసరావు, కమిటీ మాజీ సభ్యుడు ఏలూరి ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు తల్లి పథకంపై అవగాహన

సత్తెనపల్లి: బంగారు తల్లి పథకం పట్ల తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని మండల ప్రత్యేక అధికారి ఏ సుధాకర్ అన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామ, ధూళ్ళిపాళ్లలో ఎంపీడీవో బృందం, అబ్బూరు గ్రామంలో విద్యాశాఖ అధికారి ఏ శ్రీనివాసరావు బృందం బంగారు తల్లి పథకం కార్డులను పంపిణీ చేసి నిర్వహించిన ఇంటింటి అవగాహనలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థినుల రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని వాటి ద్వారా హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుకొని బంగారు తల్లిగా విద్యార్థినులు ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ దయాసాగర్, మహిళా పోలీస్ భాగ్యలక్ష్మి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, దాసరి పాపయ్య, శేషిరెడ్డి, శ్రీకాంత్, సీఆర్‌పీ తాళ్లూరి నరేంద్ర, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.



ధూళ్ళిపాళ్లలో ఇంటింటి అవగాహనలో మండల ప్రత్యేక అధికారి సుధాకర్, ఎంపీడీవో సత్యనారాయణ

రక్తహీనత నివారణకు చర్యలు

నకరికల్లు: విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందని ప్రత్యేక అధికారి బి.బాలునాయక్ అన్నారు. బంగారుతల్లి కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రక్తహీనత కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం మాట్లాడారు. రక్తహీనత కలిగిన పిల్లలకు ఆకుకూరలు, బెల్లం, పోషకవిలువలు కలిగిన ఆహారం ఇవ్వాలని సూచించారు. రక్తహీనత నివారణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లలో వైద్యులను సంప్రదించి సూచించిన మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ ఎస్.ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు నగేష్, వైద్యసిబ్బంది, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు సూచనలిస్తున్న మండల ప్రత్యేకాధికారి బి.బాలునాయక్

నా మట్టి - నా దేశం కార్యక్రమంలో భాగస్వామ్యంకండి

పెదకూరపాడులో విద్యార్థులు ర్యాలీ

పెదకూరపాడు: నా మట్టి – నా దేశం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కాకతీయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌బాబు అన్నారు. పెదకూరపాడులో కాకతీయ విద్యా సంస్థలు, స్థానిక జనచైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ క్రీడా, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం సౌజన్యంతో శుక్రవారం మేరీ మాటీ మేరా దేశ్‌లో భాగంగా మాటీ కా నమన్ వీరోంకో వందన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనచైతన్య సమితి కార్యదర్శి తుళ్ళూరు సాంబశివరావు మాట్లాడుతూ ఆరువేల గ్రామాల నుంచి నెహ్రూ యువకేంద్రం సంఘటన్, కేంద్ర ప్రభుత్వ క్రీడా, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు పంచ్ ప్రాణప్రతిజ్ఞను నిర్వహించి ఇంటింటికి వెళ్లి బియ్యం, మట్టిని సేకరించి, ఢిల్లీలో నిర్వహించబోయే జాతీయ స్థాయి కార్యక్రమంలో స్వామి వివేకనంద విగ్రహం వద్ద సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జనచైతన్య సమితి నిర్వాహకులు వెలితోటి అనిల్‌కుమార్, దాసరి విజయబెన్ని బాబు పాల్గొన్నారు. జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు.

పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ

- నకిలీ, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు
- సత్తెనపల్లి నియోజకవర్గ ఓటర్లు : 2,34,442 మంది
- ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

సత్తెనపల్లి: ముసాయిదా ఓటర్ల జబితాను సత్తెనపల్లి ఆర్డీవో, ఈఆర్వో బీఎల్ఎస్ రాజకుమారి శుక్రవారం విడుదల చేశారు.



ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేస్తున్న ఆర్డీవో రాజకుమారి, సీనియర్ అసిస్టెంట్ బోస్‌బాబు

పక్కాగా ఓటర్ల జాబితా

ఓటర్ల జాబితా పకడ్బందీగా తయారు చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. ఈ క్రమంలో ఇప్పటికే ఏఈఆర్వోలతో సమీక్ష నిర్వహించాం. హేతుబద్ధీకరణ జవాబుదారీతనం పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించడంలో క్షేత్రస్థాయిలో ఏఈఆర్వోలు అత్యంత బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశాలు జారీ చేశాం. దీనిలో భాగంగా తయారు చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించాం. జనవరి 5 వరకు క్లెయిమ్‌ల అభ్యంతరాలను పరిష్కరించి అర్హులకు ఓటర్ల జాబితాలో స్థానం కల్పించాలని సూచించాం.

– బీఎల్ఎస్ రాజకుమారి, ఆర్డీఓ, సత్తెనపల్లి

2023 అక్టోబర్ 27 నాటికి డ్రాఫ్ట్ రోల్...

మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సత్తెనపల్లి టౌన్	45	22,595	24,079	05	46,679
సత్తెనపల్లిరూరల్	75	29,201	30,583	04	59,788
ముప్పాళ్ళ	44	17,078	17,849	01	34,928
రాజుపాలెం	47	20,164	20,972	04	41,140
నకరికల్లు	63	25,938	25,966	03	51,907
మొత్తం	274	1,14,976	1,19,449	17	2,34,442

వ్యాపార కేంద్రాలుగా ఆర్యవైశ్య సత్రాలు

సత్తెనపల్లి: ఆర్యవైశ్య సత్రాలు వ్యాపార కేంద్రాలుగా మారాయని ఆవోప పట్టణ అధ్యక్షుడు మోటమర్రి చందూ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆర్యవైశ్య యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్య సత్రాల్లో మధ్యతరగతి, నిరుపేద ఆర్యవైశ్యులకి వసతులు గాని ఇతర సౌకర్యాలు అందని ద్రాక్షగా మారిందన్నారు. ఆర్యవైశ్య సత్రాలు ఎంతో అధ్వాన స్థితిలో ఉన్నాయని, సరైన నిర్వహణ లేకపోవడం వల్ల ఎంతో మంది ఆర్యవైశ్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వీఐపీలకు మాత్రమే సత్రాల్లో ప్రాముఖ్యత ఉంటుందని, సామాన్య ఆర్యవైశ్యులు సత్రానికి వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆర్యవైశ్యులు దగ్గర డొనేషన్ తీసుకోవటానికి మాత్రమే చొరవ చూపుతున్నారు గాని మౌలిక వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారని, మరీ ముఖ్యంగా పుణ్యక్షేత్రాల్లో ఆర్యవైశ్య సత్రాల నిర్వహణ మరీ అధ్వానంగా ఉందన్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం సెక్రటరీ, న్యాయవాది పొత్తూరి హరి మణికంఠ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల్లో కొందరు రాజకీయ నిరుద్యోగులకు ఈ సత్రాలు కేంద్రంగా చేసుకొని పెత్తనం చేస్తున్నారని సత్రాల ద్వారా వారి నాయకత్వ లక్షణాల్ని నిరూపించుకోవాలని చూడటం చాలా తప్పిదమన్నారు. ఆర్యవైశ్య సత్రాల్లో మార్పులు తీసుకురావాలని కోరారు.ఇకనైనా ఆర్యవైశ్య పెద్దలు దీని మీద చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో యువజన సంఘం సభ్యులు దేవరపల్లి కాశీ విశ్వనాథం, చిలకల వాసు, చక్క రవికుమార్, స్వామి ప్రసాద్, కాకర్ల రమేష్ ఉన్నారు.



మాట్లాడుతున్న మొటమర్రి చందూ, నాయకులు